PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక
# ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.
నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 179 | 04 ఆదివారం అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



## ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత్‌కు
# స్వర్ణ పతకం...

- ఆసియా క్రీడల క్రికెట్ విజేత టీమిండియా... ఇది దేశానికే ఆనందకరమన్న ప్రధాని మోదీ...

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం తెలిసిందే. జపాన్‌లోని నిషిన్‌లో శనివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడిని నిలబెట్టుకుని సత్తా చాటింది. ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ భారత జట్టును అభినందించారు. ఇది దేశానికి ఎంతో ఆనందకరమైన సందర్భమని కొనియాడారు. "భారత్‌కు మళ్లీ స్వర్ణం దక్కింది! ఆసియా క్రీడల్లో టైటిల్ నిలబెట్టుకున్న మన పురుషుల క్రికెట్ జట్టుకు అభినందనలు. భవిష్యత్తులోనూ జట్టు సభ్యులు మరిన్ని విజయాలు సాధించాలి" అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు, ఐసీసీ చైర్మన్ జై షా కూడా జట్టును అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ...మిగతా 2 లో...

- ఫైనల్లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం
- వరుసగా రెండోసారి ఆసియా క్రీడల స్వర్ణాన్ని నిలబెట్టుకున్న టీమిండియా
- అద్భుత హాఫ్ సెంచరీలతో రాణించిన అభిషేక్ శర్మ, తిలక్ వర్మ
- విజేతగా నిలిచిన భారత జట్టును అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ

## నా పోటీ హుజూర్‌నగర్ నుంచే..
# వదంతులు నమ్మొద్దు

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి



తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగా నాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలివి ుటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవ చ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తుంగతుర్తి నియోజకవర్గ పరిధి లోని తన స్వగ్రామం తాటిపాములలో అభి వృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ...మిగతా 2 లో...

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే
# రద్దు చేయాలి...

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్



- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

# క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..
## పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు. ...మిగతా 2 లో...

## మహిళా అభ్యర్థిపై స్టాలిన్ కామెంట్స్.. తీవ్రంగా స్పందించిన సీఎం విజయ్

- టీవీకే అభ్యర్థి సత్యభామపై డీఎంకే నేతల వ్యక్తిగత వ్యాఖ్యలు
- ఇది డీఎంకే విద్వేషపూరిత సంస్కృతికి నిదర్శనమన్న విజయ్
- సత్యభామకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించిన సీఎం
- అక్టోబర్ 6 ఉపఎన్నిక వేళ పెరుగుతున్న రాజకీయ వేడి

ధరాపురం ఉపఎన్నిక ప్రచారంలో టీవీకే అభ్యర్థి సత్యభామపై డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచార అంశాలను పక్కన పెట్టి, ఒక మహిళా అభ్యర్థి శరీర ఆకృ తిని లక్ష్యంగా చేసుకుని అసభ్య కర మైన వ్యాఖ్యలు చేయడఎన్నికల ప్రచా రంలో ఇలాంటి వ్యాఖ్యలకు తావు లేదని సీఎం విజయ్ స్పష్టం చేశారు. మహిళలపై డీఎంకే నేతలు అసభ్య కరమైన, అవమానకరమైన భాషను ఉపయోగించడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో
# కీలక నిర్ణయం..!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. ...మిగతా 2 లో...

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే: సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్

- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

## నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే ఓట్ల తొలగింపు: వీహెచ్

- ఎన్నికల సంఘాన్ని కేంద్రం గుప్పిట్లో పెట్టుకుందని వీహెచ్ విమర్శ
- రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే ఓట్ల తొలగింపు అని మండిపాటు



# నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే ఓట్ల తొలగింపు: వీహెచ్

మొదటిపేజీ తరువాయి

నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఈ కుట్రను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (ఈసీ) తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగింపజేస్తున్నారని వీహెచ్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేయాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జనాభా గణన జరుగుతున్నా, అందులో ఓబీసీల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు.ఈ అంశంపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని వీహెచ్ ప్రకటించారు. రేపు శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి, 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడేందుకు ఇదే చివరి అవకాశమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రం ఓబీసీ గణన చేపట్టేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

# హుజురాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన విస్తృత స్థాయి సమావేశం



(ప్రజా సీమ) :

హుజురాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన విస్తృత స్థాయి సమావేశం తెలంగాణ రక్షణ సేన పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ ఇంచార్జ్ సంతోష్ కుమార్ యాదవ్ గారి అధ్యక్షతన హుజురాబాద్ పట్టణంలోని రెడ్డి కాలనీలో నిర్వహించారు.ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, నాయకులు--కార్యకర్తల సమన్వయం, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల మధ్య ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన ముఖ్య నాయకులు బుర్ర నటరాజ్ గారు, పట్టణ అధ్యక్షులు కోరపల్లి సురేష్ గారు, వేముల మాధవి గారు, రొంటల రాజ్‌కుమార్ గారు, బింగి కార్తీక్ గారు, జంపాల రితేష్ గారు, కోర్నే ధర్మారెడ్డి గారు, బండ అశోక్ గారు, జి. కిరణ్ గారు, అంబాలా హరీష్ గారు, నీలి అనిల్ గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ, హుజురాబాద్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తల సహకారంతో సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు

# పెరటాసి మాసం మూడో శనివారం.. తిరుమలకు పోటెత్తిన భక్తులు

**సర్వదర్శనానికి 30 గంటలకు పైగా నిరీక్షణ సమయం**

**ఆక్టోపస్ భవనం వరకు కిలోమీటర్ల మేర విస్తరించిన క్యూలైన్లు**

**గోవింద నామస్మరణతో మార్మోగుతున్న సప్తగిరులు**

**భక్తుల కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు**

పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసంలో, ముఖ్యంగా శనివారం నాడు స్వామివారిని దర్శించుకునేందుకు తమిళనాడుతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి.శనివారం ఉదయం నాటికి శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించిన అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 30 గంటలకు పైగా సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు అంచనా వేస్తున్నారు. పెరటాసి మాసం విష్ణుమూర్తి ఆరాధనకు ఎంతో పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలోని శనివారాల్లో శ్రీవారిని దర్శించుకుంటే విశేష ఫలాలు దక్కుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతీయేటా ఈ సమయంలో తిరుమలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.కాగా, శుక్రవారం (అక్టోబర్ 2) నాడు 78,445 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,098 మంది తలనీలాలు సమర్పించుకోగా, హుండీ ద్వారా రూ. 4.30 కోట్ల కానుకలు సమకూరాయి. అదేవిధంగా, 4.16 లక్షల లడ్డూలు విక్రయించగా, 3.30 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అశ్విని ఆసుపత్రిలో 4,818 మంది వైద్య సేవలు పొందారు. ఈ గణాంకాలు తిరుమలలో భక్తుల రద్దీ ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్నవారికి నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భక్తులు సంయమనంతో వ్యవహరించి టీటీడీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# అంతా బాగుందనుకుంటే ప్రమాదమే.. రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్**

**ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా**

**ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి**

**వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన**

**ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు.అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.



## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే

# రద్దు చేయాలి...

మొదటిపేజీ తరువాయి

కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు.ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు.ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# మహిళా అభ్యర్థిపై స్టాలిన్ కామెంట్స్.. తీవ్రంగా స్పందించిన సీఎం విజయ్

మొదటిపేజీ తరువాయి

ఇది డీఎంకే పార్టీలో పాతుకుపోయిన విద్వేష, అసభ్యకరమైన సంస్కృతిని ప్రతిబింబిస్తోందని ఆయన ఆరోపించారు.ఈ విషయంలో తాను సత్యభామకు అండగా నిలుస్తున్నట్లు విజయ్ ప్రకటించారు. కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, తమిళనాడులోని మహిళలకు ఒక కొడుకుగా, అన్నగా, తమ్ముడిగా ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 6న జరగనున్న ఉపఎన్నిక నేపథ్యంలో టీవీకే, డీఎంకే మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రస్థాయికి చేరింది.

## నా పోటీ హుజూర్‌నగర్ నుంచే..

# వదంతులు నమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

# క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్.. పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్వర్ణ పతకం...

మొదటిపేజీ తరువాయి

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 28 బంతుల్లో 61 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. పాకిస్థాన్‌పై టీ20ల్లో ఒక భారత బ్యాటర్ చేసిన వేగవంతమైన అర్ధ సెంచరీ ఇదే. ఆ తర్వాత తిలక్ వర్మ 22 బంతుల్లోనే 51 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరును పరుగులు పెట్టించాడు. వీరితో పాటు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే కూడా రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. అనంతరం 212 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగా పోరాడింది. ఆ జట్టు బ్యాటర్ హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. ఒక దశలో పాకిస్థాన్ గెలుపు దిశగా సాగుతున్నట్టు కనిపించినా, భారత బౌలర్లు చివరిలో ఒత్తిడిని జయించారు. కీలక సమయంలో వికెట్లు తీసి మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకున్నారు. చివరి బంతికి నవాజ్‌ను శివమ్ దూబే ఔట్ చేయడంతో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 6 వికెట్ల నష్టానికి 192 పరుగుల వద్ద ముగిసింది. దీంతో భారత ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో

# కీలక నిర్ణయం..!

షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ప్రజాసీమ

# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాయలసీమకు వరాల జల్లు

## మదనపల్లె ప్రజావేదిక సభ చరిత్రలో నిలిచిపోతుంది

## టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి

## సిద్ధవటం సింగల్ విండో చైర్మన్ దశరథ రామానాయుడు





**సిద్ధవటం (ప్రజా సీమ) :**

మదనపల్లి కేంద్రంగా రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం అపూర్వ ఘట్టమని,ప్రజావేదిక సభ చరిత్రలో నిలిచిపోతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, సిద్ధవటం సింగల్ విండో చైర్మన్ దశరథ రామానాయుడు (దశ) పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధి అనంత్ అంబానీ,రాష్ట్ర విద్యా,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌లకు ప్రత్యేక కృత జ్ఞతలు తెలియజేస్తున్నామ న్నారు.లక్షలాది మంది ప్రజలు వారికి స్వాగతం పలకడంతో వారికి అరుదైన గౌం ͘వం లభించినట్లయిం దన్నారు.మదనపల్లి ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహద ͘పడుతుం దన్నారు. వ్యవసాయం, ఉద్యానరంగం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారుఈ కార్యక్రమాన్ని,సభను అత్యంత విలక్షణంగా విజయవంతం చేసినందుకు రాయలసీమ ప్రజలకు,అభిమానులకు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

# ప్రవాసాంధ్రులకు మెరుగైన సేవలందిచడమే ఏపీఎన్.ఆర్.టి లక్ష్యం

## - ఏపీఎన్.ఆర్.టి జూమ్ సమావేశంలో ప్రముఖుల స్పష్టం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

గల్ఫ్ రీజినల్ కో-ఆర్డినేటర్ కుదరవల్లి సుధాకర్ రావు ఆధ్వర్యంలో కువైట్‌లోని మాలియాలో బీబీక్యూ రెస్టారెంట్‌లో ఏపీఎన్.ఆర్.టి జూమ్ సమావేశం నిర్వహించారు.గల్ఫ్ ప్రాంతంలోని ఏపీఎన్.ఆర్.టి కోఆర్డినేటర్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి,పరస్పర సమన్వయం,అనుభవాల పంచుకోవడం,ముఖ్యమైన అంశాలపై చర్చించడం,అలాగే ప్రవాసాంధ్రులకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సమావేశంలో చర్చించారు.అదేవిధంగా భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.వివిధ దేశాల నుంచి కార్యక్రమానికి ప్రముఖులు హాజరు కాగా,మలియా ప్రాంతం నుండి సుమారు 200 మంది పాల్గొన్నారు.ఇక్కడ విచ్చేసిన సభ్యులు అందరికీ చిన్నరాజు ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథులుగా డాక్టర్ రవికుమార్ వేమూరు,రాధాకృష్ణ,నాగేంద్రబాబు హాజరై తమ అనుభవాలు,సూచనలు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో చిన్నరాజు,కొల్లి ఆంజనేయులు,మద్దిన ఈశ్వర్ నాయుడు,షేక్ ఖదరూన్,సుజన్,సుగుణమ్మ,కొండమ్రి శ్రీహరి నాయుడు,షేక్ జిలాన్ బాషా,గూడే శంకర్ చౌదరి,రమేష్ నాయుడు,వేణు రాజు,దుర్గా ప్రసాద్,వీసీ సుబ్బారెడ్డి,పెద్ద నాగూర్,కడప కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.




# విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఆర్ ప్రోగ్రామ్ దిగ్విజయం

## - ఐసీటీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై శిక్షణ

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో ఐసీటీ అకాడమీ సహకారంతో 20 రోజుల సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై విజయవంతంగా పూర్తి చేసింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే సమాచారాన్ని ధృవీకరించడం మరియు నిర్ధారించడం యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులలో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.ఈ ముగింపు వేడుకలో విశ్వం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఎం.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం మరియు ఏఐని బాధ్యతాయుతంగా వాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఏఐ ద్వారా వచ్చే అవుట్ పుట్లను విద్యా మరియు వృత్తిపరమైన అవసరాలకు ఉపయోగించే ముందు తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ ప్రోగ్రామ్ ద్వారా ఏఐ వాలిడేషన్,డేటా వెరిఫికేషన్,బాధ్యతాయుత ఏఐ వినియోగం మరియు డిజిటల్ భద్రత గురించి తెలుసుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఎం.ప్రభాకర రెడ్డి డైరెక్టర్ మిస్ ఎం.నందితా రెడ్డి,ప్రిన్సిపాల్ డాక్టర్ బి.డి వెంకటరమణా రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుబ్బా రెడ్డి,డీన్స్,అన్నివిభాగాల హెచ్ఓడీలు,కో-కోఆర్డినేటర్లు డాక్టర్ అంజన్ కుమార్ రెడ్డి,జ్యోష్ణ,తేజస్విణి,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో ఒరిగేదేమీ లేదు

## - ఓబీసీ రిజర్వేషన్లపై స్పష్టత కల్పించాలి

## - ఈనెల 13న దళితుల దేవాలయ ప్రవేశ శతాబ్ది ఉత్సవాలు

## - కాంగ్రెస్ నేత,మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఓబీసీ రిజర్వేషన్లపై స్పష్టత కల్పించాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు.శనివారం మదనపల్లె పట్టణం,దొంతి వీధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేత ఎస్.రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్లపై గత జగన్ ప్రభుత్వం,ప్రస్తుత చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం స్పష్టత లేకుండా తకదిమి తకదిమి ఆడుతున్నాయని ఆరోపించారు.ఈ నెల 13న దళిత దేవాలయ ప్రవేశ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.వంద సంవత్సరాల క్రితం తిరుపతిలో దళితుడు దేవాలయ ప్రవేశం చేయడంతో పోలీసులు అరెస్టు చేశారని,ఇప్పటికి వంద సంవత్సరాలు పూర్తి కావడంతో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాలను సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు.మదనపల్లె నిర్వహించిన సభలో లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం పేర్కొందన్నారు.వచ్చే ఆరు నెలల్లో దీని బండారం బయట పడుతుందన్నారు.ఈ హబ్ ద్వారా రైతులకు ఒరిగేది శూన్యమన్నారు.నిన్న రైతుల కోసం దేశ ఆర్థిక కేంద్రమంత్రి నిర్మలా సీతారమన్ మదనపల్లెకు వచ్చిందని,నేను మూడేళ్లుగా అడుగుతున్నా బ్యాంకుల్లో 16.5 లక్షల కోట్లు రూపాయలను రుణమాఫీ చేసిననట్లు ప్రకటించారని,కానీ అందులో ఒక రైతుకైనా మాఫీ జరిగిందా అని ప్రశ్నించారు.వేల కోట్లు ప్రరిశ్రమల కోసం తీసుకున్న బడా బాబులకే రుణమాఫీ చేసిన ఘనత మోదీ,నిర్మలా సీతారమన్ కూటమి ప్రభుత్వానికి దక్కిందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశవ్యాప్తంగా ఇందిరాగాంధీ వేల కోట్లు భూములను ఉచితంగా దళితులకు పట్టాలు మంజూరు చేసిందని,మా ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత దళితులకు భూములను రిజర్వేషన్ చేసి పక్కాగా ఇస్తామని చెప్పారు.ఆర్టికల్ 46 భారత రాజ్యాంగంలో ఉందని ఇందులో



ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ రుణాలు అందజేయాలని,గత ప్రభుత్వాలు వీటి పూర్తిగా పక్కన పెట్టాయని గుర్తుచేశారు.ప్రాంతీయ పార్టీలు ఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.సోనియగాంధీ ఆశిస్సులతో ఓబీసీ 27 శాతం అమలు చేస్తే ఎంతో మంది ఓబీసీలు ఉన్నత పదవుల్లో ఉద్యోగాలు సాధించారన్నారు.చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ తప్పులు చేసి దొంగలా తిరుగుతున్నారని ఆరోపించారు.ఇప్పటికే దేశవ్యాప్తంగా జ్ఞానేశ్వర్ పదవి నుంచి తొలగించాలని పెద్దఎత్తున్న ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ నేత షేక్ రెడ్డి సాహెబ్,యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శరత్ కుమార్ రెడ్డి,మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శన్,నాయకులు విశ్రాంత ఎంఈఓ బండ పల్లి ఈశ్వరయ్య, మీనాకుమారి,మహమ్మద్ ఆలీ,నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

# పుల్లంపేటలో సాఫ్ట్‌బాల్ సమరం!

**13, 14, 15 తేదీల్లో రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పోటీలు**

**కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు క్రీడా సందడి**

**పుల్లంపేట,(ప్రజా సీమ)**

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా పుల్లంపేట ముస్తాబవుతోంది. ఈ నెల 13, 14, 15 తేదీల్లో కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటనున్నారు.

**ప్రతిభకు పట్టం.. భవిష్యత్ క్రీడాకారుల అన్వేషణ,,,**

ఈ పోటీల ప్రధాన లక్ష్యం కేవలం విజేతలను ఎంపిక చేయడం మాత్రమే కాదు. వివిధ జిల్లాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి సామర్థ్యాన్ని గుర్తించడం, రాష్ట్రస్థాయి పోటీ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పోటీలను నిర్వహిస్తున్నారు.
జిల్లా స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీ వాతావరణాన్ని పరిచయం చేయడం ద్వారా వారి ఆటతీరును మరింత మెరుగుపర్చేందుకు అవకాశం కల్పించనున్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, జట్టు సమన్వయం, వ్యూహాత్మక ఆలోచన, ఒత్తిడిలోనూ సమర్థవంతంగా ఆడే సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించనున్నారు.

**మూడు రోజులు.. మైదానంలో హోరాహోరీ,,**

13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పుల్లంపేటలో సాఫ్ట్‌బాల్ పోటీల సందడి కొనసాగనుంది. వివిధ జిల్లాల జట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుండటంతో మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగనున్నాయి. ప్రతి పాయింట్ కోసం పోరాటం, ప్రతి మ్యాచ్‌లో వ్యూహాత్మక



ఆటతీరుతో క్రీడాకారులు ప్రేక్షకులను అలరించనున్నారు.

**జిల్లాల మధ్య పోటీ.. క్రీడా స్ఫూర్తికి ప్రోత్సాహం**

వివిధ జిల్లాల జట్లు ఒకే వేదికపై తలపడటం ద్వారా ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం ఏర్పడనుంది. ప్రత్యర్థి జట్ల ఆటతీరును గమనించడం, తమ లోపాలను గుర్తించడం, తదుపరి పోటీలకు మరింత మెరుగ్గా సిద్ధం కావడం వంటి అనుభవాలు క్రీడాకారులకు లభించనున్నాయి.

**సాఫ్ట్‌బాల్‌కు కొత్త ఊపు,,**

యువతను క్రీడల వైపు ఆకర్షించడం, సాఫ్ట్‌బాల్‌కు మరింత ప్రాచుర్యం కల్పించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి భవిష్యత్ పోటీలకు సిద్ధం చేయడం ఈ కార్యక్రమంలో మరో





ముఖ్య ఉద్దేశంగా ఉంది.

## జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర 2026 అవార్డ్ సాధించిన బోయిన పల్లి హై స్కూల్.

కడప జిల్లా రాజంపేట మండలం కొత్త బోయినపల్లి పీఎం శ్రీ ఎస్ జె ఎస్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర 2026 అవార్డ్ సాధించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి కడప కలెక్టరేట్ లోని సభా భవనం లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,స్వచ్ఛంధ్ర మేనేజింగ్ డైరెక్టర్ బి.సునీల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు కె.భారతి అందుకున్నారు. ఈ సందర్భం గా ఈ సభలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి స్వచ్ఛ ఆంధ్ర 2026 లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమం ప్రసారము చేశారు. తమ పాఠశాల ఈ అవార్డు సాధించడం పట్ల పారిశుధ్య కార్మికులను,బాల బాలికలను,ఉపాధ్యాయ బృందసహకారం, ఎంపిక చేసిన జిల్లా ఉన్నతాధికారులకు ప్రధానో పాధ్యాయురాలు కె.భారతి కృతజ్ఞతలు తెలియజేసారు.




## స్వచ్ఛ ఆంధ్ర-2026 అవార్డు రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు

### జిల్లా స్థాయిలో ఉత్తమ పారిశుధ్య నిర్వహణకు గుర్తింపు

### కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సూపరింటెండెంట్ కెజియా రాణి

**రాజంపేట (ప్రజా సీమ):**

కడప జిల్లా రాజంపేట ఏరియా హాస్పిటల్ జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర--2026 అవార్డును సాధించింది. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం రాత్రి కడప కలెక్టరేట్‌లోని సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, స్వచ్ఛ ఆంధ్ర మేనేజింగ్ డైరెక్టర్ బి. సునీల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా రాజంపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ కెజియా రాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న స్వచ్ఛ ఆంధ్ర--2026 కార్యక్రమాన్ని కడప కలెక్టరేట్‌లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రసారం చేశారు. జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర--2026 అవార్డు సాధించడం పట్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ కెజియా రాణి హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులు, హాస్పిటల్ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అవార్డు ఎంపికలో సహకరించిన జిల్లా ఉన్నతాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




## ఘనంగా 'సేవా మేరా యోగ్దాన్'.. మొక్కలు నాటి, విద్యార్థుల పోటీల్లో పాల్గొన్న డాక్టర్ నవీన్ కుమార్

**రాజంపేట (ప్రజా సీమ):**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా మేరా యోగ్దాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం రాజంపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజుతో కలిసి టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ నవీన్ కుమార్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన మొక్కలను సంరక్షించేలా అందరూ చొరవ చూపాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన చిత్రలేఖనం, స్కిల్ డెవలప్‌మెంట్ పోటీలకు డాక్టర్ నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. నేటి సమాజంలో రాజకీయాల పట్ల యువత సమగ్ర అవగాహన పెంచుకోవాలని, విలువలతో కూడిన స్వచ్ఛమైన, కల్తీలేని నాయకులుగా ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక టీడీపీ నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అశోక్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార అవగాహన కార్యక్రమం

**(ప్రజా సీమ):**

కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవంలో భాగంగా శనివారం రోజున పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్ సందర్భంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేసి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలనిఅ ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ , అంగన్వాడీ టీచర్ జమీన, తల్లులు, ఏఎన్ఎం స్వరూప, ఆశ, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలు

### - కూటమి పాలనలో గ్రంధాలయాలకు పరిపుష్టి

### - జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవా రెడ్డి స్పష్టం






**మదనపల్లె (ప్రజా సీమ) :**

గ్రంధాలయాలు సరస్వతి నిలయాలని, కూటమి పాలనలో గ్రంధాలయాలకు పరిపుష్టి చేకూరుతోందని ఉమ్మడి చిత్తూరు జిల్లాల గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవా రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి శర్మతో కలిసి మదనపల్లె ప్రధాన శాఖ గ్రంధాలయంలో జిల్లా గ్రంధాలయ అధికారులకు ఏపి గ్రంధాలయ పరిషత్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గురవారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రంధాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు గ్రంధాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన,పుస్తకాల సంఖ్యను పెంచుతున్నార న్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో గ్రంధాలయాల నిర్వహణ చక్కగా ఉందని ప్రశంసించారు. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఉద్యోగాలకు నోటిఫికేషన్ల జారీ చేశాయని,కావున నిరుద్యోగ అభ్యర్థులు తమకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయ యాప్ వినియోగంలో జిల్లా కాస్త వెనుకబడి ఉందని,యాప్ వినియోగంపై పాఠకులు ,విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు .ప్రస్తుతం గ్రంథాలయాల్లో 19 వేల పుస్తకాలు అందుబా టులో ఉన్నాయన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియతో గ్రంథాలయ పఠనం సులభతరమవు తుందన్నారు. ప్రతి ఏడాది గ్రంథాలయాల్లో వేసవిజ్ఞాన శిబిరాలు ఎంతో విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు .జిల్లాలోని గ్రంథాలయాలు, బిడిసిలు చురుకుగా పనిచేయ వాలని సూచించారు .గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,మంత్రి లోకేష్ బాబులు ప్రత్యేక కృషిచేస్తున్నారని కొనియాడారు .కావున నిరుద్యోగులు, విద్యార్థులు గ్రంథాలయాలను చక్కగా సద్వినియోగం చేసుకుని సృజనాత్మకతను, మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు వసంత కుమారి,తులసి నాయక్,చంద్రశేఖర్ నాయక్, సోమశేఖర్,జిలానీ బాషా, అమరనాథ్, రవీంద్ర బాబు,రెడ్డి కుమార్,ప్రమీల,సుభాషిణి,సుజాత,జీవన్, శ్రీధర్ సిబ్బంది జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యలో వేడుకగా ఇండస్ట్రీ-అకాడెమియా లీడర్స్ కాన్‌క్లేవ్

### - హాజరైన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు





**మదనపల్లె (ప్రజా సీమ) :**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (యూజీసీ - అటానమస్) మదనపల్లెలో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,ఉద్యోగ అవకాశాలు,కెరీర్ అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రీ అకాడమియా లీడర్స్ కాంక్లేవ్ - ఇన్స్పైర్,కాలేబరేట్,ఇన్నోవేట్ కార్యక్రమాన్ని శనివారం కళాశాల సెమినార్ హాల్-114లో నిర్వహించినట్లు కళాశాల ప్రతిని ధులు తెలిపారు. పరిశ్రమలు,విద్యాసంస్థల మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసి,విద్యార్థులను పరిశ్రమలకు సిద్ధం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పరిశ్రమ నిపుణులు హాజరై విద్యార్థులు,అధ్యాపకులతో తమ అనుభవాలను పంచుకున్నారు. బోస్టన్ ఇనిస్టిట్యూట్ ఎనాలిటిక్స్ డైరెక్టర్,టై ఒప్పుకనెక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ సురేష్ అడిగా,యాకసెంచర్ సీనియర్ మేనేజర్ అరుణ్ శర్మ,యాప్ బౌల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ - బిజినెస్ ఆపరేషన్స్ కన్నన్ శివరామన్,అల్టిమెట్రిక్ వైస్ ప్రెసిడెంట్ - డేటా అండ్ ఏఐ రేఖా కొడాలి,యాకసెంచర్ సీనియర్ మేనేజర్ రాజా బాలరామన్ ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. వీరు పరిశ్రమలలో ప్రస్తుతం ఉన్న అవకాశాలు,అవసరమైన నైపుణ్యాలు,డేటా- ఏఐ రంగ అభివృద్ధి,కెరీర్ ప్రణాళిక,పరిశ్రమలకు అనుగుణమైన విద్యా విధానాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్.రామమోహన్ రెడ్డి,ప్రెసిడెంట్ ఎన్.నాగమల్లా రెడ్డి ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ,విద్యార్థులు తరగతి గదిలో పొందే సాంకేతిక జ్ఞానంతోపాటు పరిశ్రమలలో జరుగుతున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. పరిశ్రమ ప్రముఖులతో విద్యార్థులకు నేరుగా సంభాషించే అవకాశాన్ని కల్పించడం ద్వారా వారి ఆలోచనా విధానం,కమ్యూనికేషన్ నైపుణ్యాలు,కెరీర్ దృక్పథం మెరుగుపడతాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగా రెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థలు మరియు పరిశ్రమలు పరస్పరం కలిసి పనిచేసినప్పుడే విద్యార్థులు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను సంపాదించగలరని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు పెయ్యాల మాట్లాడుతూ ఇలాంటి ఇండస్ట్రీ-అకాడెమియా కార్యక్రమాలు విద్యార్థులకు పరిశ్రమల వాస్తవ అవసరాలను అర్థం చేసుకునే అవకాశం కల్పించడం తోపాటు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, పరిశోధన, ప్లేస్‌మెంట్లకు దోహదపడ తాయని తెలిపారు. ఈ కార్యక్రమ కన్వీనర్ మరియు సీఎస్‌ఈ (ఏఐ) విభాగాధిపతి డాక్టర్ ఎం.రోషిణి మాట్లాడుతూ పరిశ్రమ నిపుణులతో నేరుగా జరిగే చర్చలు విద్యార్థులకు కొత్త సాంకేతిక ధోరణులు,వృత్తి అవకాశాలు,అవసరమైన సాంకేతిక మరియు వ్యక్తిగత నైపుణ్యాలపై స్పష్టత ఇస్తాయని తెలిపారు. కార్యక్రమ కోఆర్డినేటర్,ఆర్ అండ్ డి కన్వీనర్ డాక్టర్ పి.గంగాధర రెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రీ ఇంసైట్స్ ,అకాడమిక్ ఎక్సలెన్స్,నెట్వర్కింగ్,కెరీర్ గ్రోత్ వంటి అంశాలపై ఈ కాన్‌క్లేవ్ ప్రత్యేక దృష్టి సారిస్తుందని,విద్యార్థుల ప్రాజెక్టులు మరియు పరిశోధనలను పరిశ్రమ అవసరాలకు అనుసంధానం చేయడం కూడా ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాల హెచ్‌ఓడీలు,సీనియర్ అధ్యాపకులు,అధ్యాపక బృందం ఈ కార్యక్రమ విజయవంత నిర్వాహణకు సహకరించారని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరిశ్రమ ప్రముఖులతో పరస్పర చర్చల్లో పాల్గొని,భవిష్యత్ కెరీర్‌కు అవసరమైన మార్గదర్శకత్వాన్ని పొందాలని కళాశాల యాజమాన్యం సూచించింది. బ్రిడ్జింగ్ ఇండస్ట్రీ అండ్ అకాడమియా ఫర్ ఎ బెటర్ టుమారో అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు,పరిశ్రమ నిపుణుల మధ్య బలమైన సహకారానికి వేదికగా నిలిచింది.

## వన్యప్రాణులపై విద్యార్థులకు అవగాహన

### సిద్ధవటం ఫారెస్ట్ రేంజర్, నయీమ్ అలీ









**సిద్ధవటం (ప్రజా సీమ )**

కడప డిఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాల ప్రకారం విద్యార్థినీ విద్యార్థులకు వన్యప్రాణుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని సిద్ధవటం ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నయీమ్ ఆలీ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని నలంద స్కూల్లో శనివారం కడప డీఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాలతో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన నిర్వహించామని సిద్దవటం ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజర్ నయీశీ ఆలీ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుండి, 8 తేదీ వరకు అటవీ ప్రాంతంలో ఉన్న వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని వన్యప్రాణుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలిపామని అడవుల ప్రయోజనాలు వ్యాసరచన పోటీలు నిర్వహించామని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారన్నారు అటవీ ప్రాంతాన్ని పచ్చదనంతో ఉండేటట్లు విద్యార్థులు ప్రతి ఒక్కరూ మీ ప్రాంతాలలో తెలపాలని వన్యప్రాణులు దాహం కోసం గ్రామాల్లో కొస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా ఫారెస్ట్ అధికారులకు తెలపాలని సూచించారు అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు పచ్చని చెట్లు పెంచి పచ్చదనాన్ని పెంచాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డేంజర్, ముక్తార్ భాష, నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు ఖ+దీఎ పుల్లంపేట విద్యార్థిని రాణి ఎంపిక

**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

పుల్లంపేట మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పి. రాణి రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ మేరీ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, జడ్పీహెచ్ఎస్ తిరుచానూరులో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఎలక్యూషన్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పి. రాణి జిల్లాస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సేవ సంకల్ప్ కార్యక్రమానికి ఎంపికైందని పేర్కొన్నారు.విద్యార్థిని రాణికి పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు కేతియా మార్గదర్శకత్వంఅందించారని ప్రిన్సిపాల్ తెలిపారు. రాణి రాష్ట్రస్థాయిలో సైతం రాణించి పాఠశాలకు, జిల్లాకు పేరు తెస్తుందని ఆమె ఆకాంక్షించారు.రాణి రాష్ట్రస్థాయిలో చోటు సాధించడంపట్లప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తంచేసిఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయంఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని వారు అన్నారు.



# శ్లోకా పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

### - ఉత్సహాభరితంగా తాత, అమ్మమ్మ మధ్య పిల్లలు

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక శ్లోకా పాఠశాలలో గ్రాండ్ పేరేంట్స్ డే వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి వెల్లడించారు. శనివారం ఆ పాఠశాల ఆవరణలో ఉత్సహాభరితంగా తాత, అమ్మమ్మ ల మధ్య పిల్లలు పాల్గొన్నారు. అలాగే మనవడు, మనవరాళ్లు తమ తాత, అమ్మమ్మ కోసం ప్రత్యేక నృత్యాలు, ఆటలు, పాటలు, పద్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బండి నవనీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల జీవితంలో తమ తాత, అమ్మమ్మల పాత్రను గౌరవిస్తూ.. వీరి మధ్య ఉన్న అమూల్యమైన బంధాన్ని గుర్తు చేసుకునేందుకు ఈ వేడుకలు దోహద పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

### సాఫ్ట్ బాల్, బేస్ బాల్ విభాగాల్లో దిలీప్ రెడ్డి, యుగంధర్, తన్విక, హేమలత ప్రతిభ

**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్**

పుల్లంపేటమండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలోవిద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లీల శ్రీహరి, పిడి నీలకంఠరావు తెలియజేశారు.పిడి వివరాల మేరకు, ఎస్జీఎఫ్ అండర్-19 బాల, బాలికల సాఫ్ట్ బాల్ మరియు బేస్ బాల్ క్రీడా పోటీలు వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో ఆదర్శ పాఠశాల నుంచి బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలుర సాఫ్ట్ బాల్ విభాగంలో 10వ తరగతి చదువుతున్న దిలీప్ రెడ్డి, బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న తన్విక, అదేవిధంగా బేస్ బాల్ బాలుర విభాగంలో 10వ తరగతి చదువుతున్న యుగంధర్, బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న తన్విక, హేమలత అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, పిడి తెలియజేశారు.అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీలలో తన్విక, హేమలత పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు



పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగాఅభినందించారు. ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకుస్ఫూర్తిదాయకమని వారు అన్నారు.

# ఎద్దుల కొండ్రాయునికి వెండి ఒడ్డాణం

### - భక్తుల దాతృత్వం మరువలేనివి

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక పాపాగ్నినది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వర స్వామి ఎద్దుల కొండ్రాయునికి భక్తుడు వెండి ఒడ్డాణం బహుకరణ చేసినట్లు ఆలయ ఇఓ కడప సుభాష్ వెల్లడించారు. శనివారం ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన భక్తుడు ఎలిగండ్ల బాలయ్య సతిమణి సుశీల రూ.లక్ష 2వేలు విలువ గల 443 గ్రాముల వెండి ఒడ్డాణాన్ని స్వామికీ సమర్పించారు. కుటుంబ సభ్యులు ప్రదీప్ కుమార్, సతిమణి జయవాణి, మనవళ్లు భరత్, దేవాన్ష్ లతో కలిసి అర్చకుడు హరిప్రవీణ్, పాలక మండలి చైర్మన్ పివి రమణ లకు అందజేశారు. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ఇఓ, చైర్మన్ మాట్లాడుతూ దాతల దాతృత్వం మరువలేనివని, ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పుల్లంపేట మండలంలో ఘనంగా 'అంగన్‌వాడీ ఉత్సవం

**అంగన్‌వాడీ కార్యకర్తలకు సన్మానం**

పుల్లంపేట మండలంలో 'అంగన్‌వాడీ ఉత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పుల్లంపేట-1, పుల్లంపేట-2, రామకపల్లి, ఆర్.రాచపల్లి,గారాలమడుగుఅంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు లతా .శ్రీలక్ష్మి. ఆశా కార్యకర్తలకు లక్ష్మి వారినీ సన్మానంచార్ట్.శ్రీ నరేంద్ర మోదీ గారి 25 సంవత్సరాల సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా టీచర్లకు, కార్యకర్తలకు బిజెపి మండల అధ్యక్షుడు కమలాపురం మనోహర్ రెడ్డి, మహిళా మోర్చా సెక్రటరీ కుప్పల జ్యోతి, సీనియర్ నాయకుడు కంబాల శ్రీనివాసులు చిరు సన్మానం కార్యక్రమం నిర్వహించారు.వారు మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, గర్భస్థ స్థాయి నుంచి తల్లులకు మంచి పోషకాహారం అందించడమే కాకుండా, పుట్టినప్పటి నుంచినాలుగుసంవత్సరాల వరకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులకు భారం కాకుండా, ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు పిల్లలను ఆదరిస్తూ, విద్యాబుద్ధులు నేర్పుతూ, మంచి పౌష్టిక ఆహారం అందిస్తూ, వారిని మంచి ఆరోగ్యకర బాలుడిగా తీర్చిదిద్దుతున్న ఒక తల్లిలాగా ఆదరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో మీరు కూడా ఒక భాగమని, ఇంకా మంచి పనులు చేసి సమాజంలో భాగ స్వాము లు




కావాలని వారుసూ చించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సి.డి.పి.ఒ. రేణుక, సూపర్వైజర్ జయలక్ష్మి . ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### 6 మద్యం బాటిల్స్ స్వాధీనం

### ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

**సిద్ధవటం ప్రజా సీమ**

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 6 మద్యం బాటిల్స్ స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆయన శనివారం మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కడప - చెన్నై జాతీయ రహదారి శివుని పల్లి సమీపాన కడప ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టగా నరసయ్య అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద నుండి 6 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే కఠినమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ రాజశేఖర్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు



# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ ప్రాంతానికి వరం

### - కొనియాడిన మదనపల్లె కూటమి ముఖ్యనేతలు

### - సభను జయప్రదం చేసిన కూటమి శ్రేణులు,ప్రజలకు కృతజ్ఞతలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అక్టోబర్ 2,2026 మదనపల్లి చరిత్రలో నిలిచిపోతుందని,గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమకు మణిహారమని మదనపల్లె కూటమి ముఖ్యనేతల పేర్కొన్నారు.కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ బాబు,వ్యాపార దిగ్గజం అనంత్ అంబానీలు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రజావేదిక బహిరంగ సభ విజయవంతమైన నేపథ్యంలో శనివారం దేవత నగర్ నందు గల తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ కార్యాలయం నందు బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి,జనసేనపార్టీ రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి,తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,ఏఎంసీ మార్కెట్ చైర్మన్ జంగాల శివరాం,రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం జరిగిన సభ చరిత్రలో కనీవిని ఎరుగని ఒక మరుపురాని కార్యక్రమమని,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముగ్గరి చొరవతో రాయలసీమని సస్యశ్యామలం చేసే దిశగా కూటమి పనిచేస్తుందని,ప్రజలు కూటమి నాయకులు కార్యకర్తలు పనిచేసిన తీరు ప్రశంసనీయమని,గ్రేటర్ రాయలసీమ 10 జిల్లాల్లో రాబోయేది స్వర్ణయుగమని ముఖ్యంగా మదనపల్లి జిల్లా కేంద్రమైన తర్వాత ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ మదనపల్లికి రావడం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మదనపల్లి ప్రజల తరపున ధన్యవా దాలు తెలిపారు.వయసులో చిన్న వాడైన అనంత్ అంబానీ ఎంతో వినయం,విధేయత నన్ను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించండని చెప్పగా అందరి హృదయాలు చలించాయని కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలకి రాబోయే కాలంలో వైసీపీ



ప్రభుత్వం,వైసీపీ నాయకులు ఓటు అడిగే అర్హత కూడా కోల్పోయిందన్నారు.గ్లోబల్ హార్టికల్చర్ హబ్,ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుతో రాయలసీమలో సిరులు కురుస్తాయని వారు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు పురం నగేష్,బీసీ జాతీయ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి మల్లిక,టౌన్ సెక్రటరీ జనార్ధన్,వాణి,టీడీపీ టీడీపీ మాజీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు,రాష్ట్ర బోయ కార్పొరేషన్ డైరెక్టర్ మండ్యం ప్రభాకర్,టీడీపీ రూరల్ అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు,టీడీపీ తెలుగు యువత నాయకులు మహబూబ్ ఖాన్,గుండ్లపల్లి ప్రభాకర్,ఉమేష్,బీజేపీ పట్టణ అధ్యక్షులు మఠం కిరణ్,విఠలం నవీన్ కుమార్,బీజేపీ యువ మోర్చా నాయకులు శ్రీకాంత్,కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలి

**పుల్లంపేటప్రజా సీమ న్యూస్:**

పుల్లంపేట,ఆనందసముద్రం, జాగువారిపల్లి గ్రామపంచాయతీలస్పెషల్ ఆఫీసర్ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ప్రత్యేకాధికారి లేకపోవడంతో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి పెరగడంతో పాటు, పరిపాలనా వ్యవహారాల్లో వారు ఆర్థిక భారాన్ని కూడా ఎదుర్కొంటున్నారుపారిశుద్ధ్య కార్మికులకు వేతనాలుఅంద వారువిధుల కుహా జరు కావడంలోఇబ్బందులుఎదుర్కొంటున్నారని,




దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన అనంతరం స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న ఎంపీడీవో జయశ్రీ శిక్షణ కార్యక్రమానికి వెళ్లడంతో పంచాయతీ పరిపాలనలో ఇబ్బందులు ఏర్పడ్డాయిమండల కేంద్రంగా ఉన్న పుల్లంపేటతో పాటు సంబంధితగ్రామపరాయతీలకు తక్షణమే స్పెషల్ ఆఫీసర్లను నియమించి, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అధికారులు వెంటనే చొరవ తీసుకునిప్రజాసమస్యలనుపరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంజన్న సన్నిధిలో ఎమ్మెల్సీ

### - స్వామికి ప్రత్యేక పూజలు

**వేంపల్లె ప్రజాసీమ:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయ స్వామి సన్నిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్మామిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమీషనర్ విశ్వనాథ్, పాలక మండలి చైర్మన్ వెంకటస్వామి, అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి లు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. గండిక్షేత్రం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమని, స్వామి మహిమలు, చరిత్రను



## ఎస్జీఎఫ్ఐ సెటిల్ టోర్నమెంట్: కొత్తపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి అర్హత

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్

రాజంపేట డివిజన్ స్థాయి ఎస్జీఎఫ్ఐ పోటీల్లో భాగంగా ఈ రోజు సెటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో కొత్తపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి టోర్నమెంట్కు అర్హత సాధించారు.జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులలో బి. నిహారిక, చంద్రకళ, జి. చంద్ర ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అలీ అక్బర్, ఉపాధ్యాయులు పిడి సాయిరాం విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. జిల్లా స్థాయి టోర్నమెంట్లోనూ విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాలని వారు ఆకాంక్షించారు.




## పతకాల పంట పండించిన జెపి తైక్వాండో విద్యార్థులు

- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు అభినందనలు

మదనపల్లె (ప్రజా సీమ) :

తిరుపతి నగరంలో సెప్టెంబర్ 30వ తేదీ జరిగిన జిల్లా తైక్వాండో పోటీలలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణం,నీరుగట్టువారిపల్లె,సాయిరాం స్ట్రీట్ సెకండ్ క్రాస్ పరిధిలో గల జెపి తైక్వాండో అకాడమీ విద్యార్థులు పతకాల పంట పండించారు.ఇందులో ఆర్.హర్ష,ఎస్ .మధుసాయి ,ఎం.హిత్విక్,కే. కావ్య,కే.వన్షిక రెడ్డి,పి.మల్లీశ్వరి,సి.విశ్వ,ఎన్.సాత్విక్,వి .ఉదయ్ కిరణ్ అనే విద్యార్థులు బంగారు పతకాలు కైవసం చేసుకోగా,ఎస్.గీతిక,సి.మాన్య,సి.వరుణ్ కార్తీక్,కే.లాస్య,కే.కార్తీక రెడ్డి,సి.విశ్వసాయి తేజ,వి.మహిధర్,ఇమ్రాన్,హర్ష అనే విద్యార్థులు సిల్వర్,బ్రాంజ్ పతకాలు సాధించారు.ఈ సందర్భంగా శనివారం శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ జెపి తైక్వాండో అకాడమీ కోచ్ పి.విఘ్నేష్ శిక్షణలో విద్యార్థులు మొత్తం 18 పతకాలు కైవసం చేసుకోవడం అకాడమీకి,మదనపల్లి పట్టణానికి,జిల్లాకే గర్వకారణమన్నారు.విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ,అక్టోబర్ 12,13 తేదీలలో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అద్భుత విజయాలు అందుకోవాలని శ్రీరామ్ చినబాబు ఆకాంక్షించారు.క్రీడలు,క్రీడాకారులకు తమకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో శ్రీరామ్ చినబాబుకి విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో రాయలసీమకి మహర్ధశ

- బిజెపి జిల్లా అధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి హర్షం

మదనపల్లె (ప్రజా సీమ) :

రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయమని,ఉద్యానవన రంగానికి ఇది ఊతమిస్తుందని భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రమణా రెడ్డి(గోల్డెన్ వ్యాలీ విద్యాసంస్థల చైర్మన్),యువనాయుడు శ్రీకాంత్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పులి నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ కరువుకి ప్రసిద్ధిగాంచిన రాయలసీమను సిరుల సీమగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.లక్ష కోట్ల భారీ వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 40 శాతం,ప్రైవేట్ భాగస్వామ్యం 60 శాతం ఖర్చు చేయనున్నారని తెలిపారు.ఈ ప్రాజెక్టుతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంతోపాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి రమణా రెడ్డి గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమలో పది జిల్లాల్లో విస్తరించనున్నదన్నారు.ఉద్యానవన పంటల సాగును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.ఈ ప్రాజెక్టు రాయలసీమ రైతులకు ఒక వరం లాంటిదన్నారు.కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్,వ్యాపార దిగ్గజం అనంత్ అంబానీలు ఒకే వేదికపై చేరడం అద్భుత ఘట్టమన్నారు.ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానమన్నారు.



## ముద్రగడ కుటుంబాన్ని కలిసిన వంగా గీత

పిఠాపురం (ప్రజా సీమ )

పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ వంగా గీత విశ్వనాథ్ శనివారం కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముద్రగడ పద్మనాభం నివాసానికి వెళ్లిన ఆమె, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబుతో భేటీ అయ్యారు.అనంతరం ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతిని కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## మిట్స్ వర్శిటీ ఆవలంభిస్తున్న విద్యావిధానాలు సూపర్

- మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ప్రశంసలు

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీని శనివారం కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సందర్శించారని రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను ఎంపిక చేసుకునే ముందు వివిధ కళాశాలలు,యూనివర్సిటీలను సందర్శించి అక్కడి అధ్యాపకుల అర్హతలు,బోధనా నాణ్యత, అధునాతన ప్రయోగశాలలు, పరిశోధనా అవకాశాలు,మౌలిక వసతులు మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకోవాలన్నారు.ముఖ్యంగా ఆటోనమస్ కళాశాలలు మరియు డీమ్డ్ టు బీ యూనివర్సిటీల మధ్య ఉన్న విద్యావిధానం,అకడమిక్ స్వేచ్ఛ,కోర్సుల రూపకల్పన,పరీక్షలు,మూల్యాంకనం,పరిశోధన మరియు విద్యార్థులకు లభించే అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ మాట్లాడుతూ ఇలాంటి యూనివర్సిటీ విజిట్ల ద్వారా బీటెక్,ఎంటెక్ వంటి ఉన్నత విద్యా కోర్సుల గురించి,క్యాంపస్ వాతావరణం,విద్యార్థి జీవితం,పరి శ్రమలతో అనుసంధానం, ప్లేస్మెంట్లు మరియు ఇంటర్న్షిప్ అవకాశాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని తెలిపారు .యూనివర్సిటీ లోని ప్రాజెక్టులు ,ప్రెజెంటేషన్లు మరియు సాంకేతిక కార్యక్రమాలను పరిశీలించడం ద్వారా కమ్యూనికేషన్ ,టీమ్వర్క్,సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాల ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకున్నారన్నారు.ఈ పర్యటన విద్యార్థుల్లో ఉన్నత విద్యపై ఆసక్తిని పెంచడంతోపాటు,భవిష్యత్ విద్యా అవకాశాలను గుర్తించేందుకు,సరైన విద్యా సంస్థను ఎంపిక చేసుకునేందుకు మరియు ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడుతుందని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు డి.హసీనా,శ్రీప్రధ తెలిపారు.ఈ సందర్శనలో 130 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,డీన్- స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా,అసోసియేట్ డైరెక్టర్-అడ్మిషన్స్ డాక్టర్ సుధాకర్ రెడ్డి,అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



## సందడిగా దాదాగాంధీ,జాకిర్ హుసేన్ పుట్టినరోజు వేడుకలు





- శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్

ఎస్.కె.బాషామదనపల్లె (ప్రజా సీమ) :

గాంధీ జయంతి సందర్భంగా అనంతపురం క్లాక్ టవర్ సమీపంలోని గాంధీ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా,ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు .ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వైఖరిని నిరసిస్తూ నాయకులు,కార్యకర్తలు జెండాలు చేతపట్టుకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఓటర్ల జాబితాలో తొలగించిన పేర్లను తిరిగి చేర్చాలని,ఓటర్లు హక్కును వరిరక్షించాలని,ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమీషనరుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.అదేవిధంగా అనంతపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అలాగే రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్ దాదా గాంధీ,ఏపీ మైనార్టీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాకీర్ హుస్సేన్కు జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా కలిశారు.దాదాగాంధీ,జాకిర్ హుస్సేన్ కు డా.ఎస్.కే బాషా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టడంతోపాటు పుష్పగుచ్ఛం అందించి,శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ దాదా గాంధీ,ఏపీ మైనార్టీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాకీర్ హుస్సేన్,ఏపీ మైనార్టీ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాషా,మైనార్టీ కాంగ్రెస్ నాయకులు సాదిక్ అలీ,రహమత్ పీర్,శర్మస్ వల్లిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కె. బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.దేశవ్యాప్తంగా 13.50 కొట్లు ఓటర్ల పేర్లను సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు జాబితానుండి తొలగించడం ప్రజాస్వా మ్యానికి ప్రమాదకరమన్నారు .దీనికి ప్రధాన ఎన్నికల కమిషనర్ స్పష్టత ఇస్తు స్వచందంగా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరారు.

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ సభ గ్రాండ్ సక్సెస్

- దిగ్విజయం చేసిన నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు

- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా వెల్లడి






మదనపల్లె (ప్రజా సీమ) :

రూ.లక్ష కోట్ల వ్యయంతో మదనపల్లి కేంద్రంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన చేయడానికి మదనపల్లె బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు లక్ష మంది జనం తరలి రావడం ఆనందించదగ్గ విషయమని, సభను విజయవంతం చేసేందుకు తరలివచ్చిన జనాలను ఏర్పాట్లు చేసిన కృషిచేసిన తెలుగుదేశం కార్యకర్తలకు విజయాన్ని అంకితం చేస్తున్నానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు.శనివారం మిషన్ కాంపౌండ్ సిఎస్ఐ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లెకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అకుంఠితమైన దీక్షతో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకొచ్చారని,పది నెలలకు ముందు మదనపల్లి కేంద్రంగా జిల్లా కేంద్రాన్ని ప్రకటించారని,ఎల్నినో పరిస్థితులతో తీవ్ర వర్షాభావంతో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న మదనపల్లి అన్నమయ్య జిల్లా ప్రజలను ఆదుకునేందుకు హంద్రీ-నీవా ద్వారా కృష్ణాజిల్లాలను తీసుకొచ్చి మదనపల్లి ప్రాంత ప్రజలకు అపర భగీరథుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేశారన్నారు.సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్.జె.వెంకటేష్ ,రామిశెట్టి నీలకంఠ,మోడెం సిద్ధప్ప,పోతపోలు సుధాకర్,రాటకొండ భారతి,తలారి రాధా,రాగినేని రఘుపతి నాయుడు, షంషీర్,మైనార్టీ నాయకులు ఎస్.ఎం రఫీ,రాజన్న,మునిరత్న,పులి మహాలక్ష్మి, బైగారి భారతి నాయుడు, జాఫరున్నిషా, రెడ్డి భూ,ఎస్.ఏ మస్తాన్,బీదం గురునాథ్ యాదవ్, శ్రీపతి,చల్లా నరసింహులు వందలాది మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు రాయలసీమకు వరం

- మదనపల్లె ప్రజావేదిక సభ చరిత్రలో నిలిచిపోతుంది

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి హర్షం

మదనపల్లె (ప్రజా సీమ) :



మదనపల్లి కేంద్రంగా రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం అపూర్వ ఘట్టమని,ప్రజావేదిక సభ చరిత్రలో నిలిచిపోతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారిలు పేర్కొన్నారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,రిలయన్స్ ఇండిస్ట్రీస్ ప్రతినిధి అనంత్ అంబానీ,రాష్ట్ర విద్యా,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.లక్షలాది మంది ప్రజలు వారికి స్వాగతం పలకడంతో వారికి అరుదైన గౌరవం లభించినట్లయిందన్నారు.మదనపల్లి ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు.వ్యవసాయ,ఉద్యానరంగం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారుఈ కార్యక్రమాన్ని,సభను అత్యంత విలక్షణంగా విజయవంతం చేసినందుకు నియోజకవర్గ ప్రజలకు,అభిమానులకు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

# వైఎస్సార్‌సీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

ఒంగోలు, అక్టోబర్ 3(ప్రజా సీమ) :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం ఆధ్వర్యంలో ఒంగోలు నగరం, ఒంగోలు మండలానికి సంబంధించిన విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు.ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ చుండూరి రవిబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మాజీ టీటీడీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త శ్రీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త శ్రీ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు శ్రీ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ప్రకాశం జిల్లా మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల మండలి చైర్మన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీ మేరుగ నాగార్జున, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి శ్రీ పుత్తా శివశంకర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు శ్రీ బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ పరిశీలకులు శ్రీ వెంకటేశ్వర్లు నాయుడు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీ కుప్పం ప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.అలాగే అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఒంగోలు నగర అధ్యక్షులు శ్రీ కటారి శంకర్, కొత్తపట్నం మండల అధ్యక్షులు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు శ్రీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షులు శ్రీ మన్నే శ్రీనివాసరావుతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొంటారు.ప్రత్యేక కార్యక్రమాలుఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించనున్నారు.అదేవిధంగా పార్టీ వివిధ పదవులు పొందిన వారికి గుర్తింపు కార్డులను అందజేయనున్నారు.

# ఏ ఈ ఆర్ ప్రణాళికపై సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశం**

ప్రజా సీమ) :

:

అమరావతి ఆర్థిక ప్రాంతం ప్రణాళికలో భాగంగా మార్కాపురం జిల్లాకు సంబంధించిన సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఏ ఈ ఆర్ కార్యశాలలో కలెక్టర్ పాల్గొని జిల్లాలోని అభివృద్ధి అవకాశాలు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో చర్చించారు. సహజ వనరులు, వ్యవసాయం, ఉద్యానవనం, పరిశ్రమలు, పర్యాటకం వంటి రంగాల్లోని అవకాశాలను గుర్తించాలని సూచించారు.ఏ ఈ ఆర్ ప్రణాళిక ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తరించి, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు. రహదారులు, రవాణా, మౌలిక వసతులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, తాగునీరు, పట్టణ--గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.జిల్లాలోని ప్రతి ప్రాంత ప్రత్యేకతను గుర్తించి, ప్రజల అవసరాలు మరియు భవిష్యత్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని




ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాను ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్ బాబు, ఉద్యాన శాఖ అధికారి రమేష్, సీఆర్‌డీఏ

# మత్తుపదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా

**బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో చేరిన బెల్జియన్ మాలినోయిస్ జాతి హంటర్ జాగిలం**

**11 నెలల ప్రత్యేక శిక్షణ.. గంజాయి, డ్రగ్స్ గుర్తింపులో కీలక సేవలు**

ప్రజా సీమ) :

బాపట్ల జిల్లా పోలీస్ శాఖలోకి బెల్జియన్ మాలినోయిస్ జాతికి చెందిన హంటర్ జాగిలం చేరింది. గంజాయి, ఇతర మత్తుపదార్థాలను గుర్తించడంతో పాటు నేరస్థుల ఆనవాళ్లను గుర్తించేలా హంటర్‌కు మంగళగిరి సీటీసీలోని 6వ బెటాలియన్‌లో 11 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.రైళ్లు, వాహనాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు, కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లలో హంటర్ సేవలను వినియోగించనున్నట్లు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో ఐదు జాగిలాలు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు.2026లో 19 కేసుల్లో 287 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. 1,467 మంది పాత నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగుతోందని, మరో 7,012 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు."ఆపరేషన్ త్రిశూల్"లో భాగంగా జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, యువతను మత్తుపదార్థాలకు దూరంగా ఉంచేందుకు 661 ఈగిల్ క్లబ్‌ల ద్వారా 5,334 అవగాహన




కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తుపదార్థాలపై సమాచారం ఉంటే 112, 1972 నంబర్లకు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# రైతు బిడ్డల చదువులకు సైకిళ్ల వెన్నుదన్ను

**త్వరలో 20 కంప్యూటర్లతో హైటెక్ ల్యాబ్**

**30 సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు**

ప్రజా సీమ) :

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు తెలిపారు. 'పి4' విధానంలో దాతలు, సంస్థల సహకారంతో విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.భారత్ ఫౌండేషన్ సహకారంతో నియోజకవర్గంలోని 150 మంది పేద విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేశారు. కోటప్పకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 120 సైకిళ్లు పంపిణీ చేయగా, నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో మరో 30 సైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతులు, వ్యవసాయ కూలీల పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు ఈ సైకిళ్లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థుల సాంకేతిక విద్యకు తోడ్పాటుగా త్వరలో 20 కంప్యూటర్లతో హైటెక్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అలాగే దాతల సహకారంతో నియోజకవర్గంలో 14 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కష్టకాలంలో ఏలూరి ఆపన్నహస్తం

**పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.71 లక్షల వైద్యసాయం**

ప్రజా సీమ) :

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని మూడు పేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 2,71,485 విలువైన ఎల్ఓసీలు మంజూరయ్యాయి. వాటిని ఎమ్మెల్యే ఏలూరి లబ్ధిదారులకు అందజేశారు.యద్దనపూడికి చెందిన మున్నంగి మణెమ్మకు రూ. 1,01,916, చినగంజాం మండలం గోనసపూడికి చెందిన వంకాయలపాటి నాగజ్యోతికి రూ. 1,20,077, మార్టూరు మండలం బొల్లాపల్లికి చెందిన గుంటుపల్లి అంజమ్మకు రూ. 49,492 చొప్పున ఎల్ఓసీలు మంజూరయ్యాయి. వీటితో ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆర్థిక సహాయం అందనుంది."డబ్బులేక ఏ పేదవాడూ వైద్యానికి దూరం కాకూడదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందేలా కృషి చేస్తా" అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.కష్టకాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.



# పేదల వైద్యానికి ఎమ్మెల్యే ఏలూరి భరోసా

**సీఎంఆర్ఎఫ్ ద్వారా ఏడుగురికి రూ.3.09 లక్షల ఆర్థిక సాయం**

(ప్రజా సీమ) :

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలిచారు. ఆయన సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మార్టూరు మండలానికి చెందిన ఏడుగురికి రూ. 3,09,723 ఆర్థిక సాయం మంజూరైంది.మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లబ్ధిదారులకు అందజేశారు. మార్టూరుకు చెందిన అవుల తిరుపతమ్మకు రూ. 20,000, పల్లెపోగు రాణికి రూ. 30,028, మండలపు సుబ్బారావుకు రూ. 1,08,783, పబ్బిశెట్టి కృష్ణారావుకు రూ. 34,500, కుంచాల కోటయ్యకు రూ. 65,495, కెలవతి లక్ష్మీబాయికి రూ. 10,000, బొల్లాపల్లికి చెందిన రావులపల్లి పవన్‌కు రూ. 40,917 చొప్పున సాయం మంజూరైంది.



# చీరాల మున్సిపాలిటీకి రూ.1.40 కోట్లతో కాంప్యాక్టరు వాహనం

(ప్రజా సీమ) :

మున్సిపాలిటీ రోజువారీ పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ. 1.40 కోట్లతో కొనుగోలు చేసిన 42 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల కాంప్యాక్టరు వాహనాన్ని చీరాల ఎమ్మెల్యే శ్రీ మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డేనియల్, మున్సిపల్ అధికారులు, మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# రొంపిచర్లలో పలు కుటుంబాలను పరామర్శించిన డాక్టర్ గోపిరెడ్డి

(ప్రజా సీమ) :

రొంపిచర్ల మండలంలోని కొనకంచివారిపాలెం, గోగులపాడు గ్రామాల్లో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు.ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన దావులూరి భాస్కరరావు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

**ముగ్గురు అరెస్ట్.. రూ.4,550 నగదు స్వాధీనం**

(ప్రజా సీమ) :

అసాంఘిక కార్యకలాపాలపై ప్రకాశం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఒంగోలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామ శివారులోని పొలాల్లో పేకాట స్థావరంపై శనివారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది నిర్వహించిన దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 4,550 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కేసు నమోదు నిమిత్తం సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.పేకాట, జూదం తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 112, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి సీఐ 9121102113, పోలీసు వాట్సాప్ 9121102266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.



# టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

(ప్రజా సీమ) :

నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు కొన్నికళ్ల నారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ జాన్ సైదా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు--కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులతో నాయకులు ఆత్మీయంగా మమేకమై, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.



## నవదీప్ కుటుంబం ఆస్తి గురించి అజయ్ ఘోష్ ఆసక్తికర వ్యాఖ్యలు.. 'అది ఉండి ఉంటే వందల కోట్లే



తెలుగు సినీ పరిశ్రమలో విలక్షణ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ ఘోష్.. ఇటీవల సినిమా వేడుకల్లో చేస్తున్న కొన్ని వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా హీరోల ఆస్తులు, రియల్ ఎస్టేట్ పెట్టుబడుల గురించి ఆయన ప్రస్తావిస్తున్న విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. తాజాగా ఓ సినిమా కార్యక్రమంలో హీరో నవదీప్ కుటుంబానికి సంబంధించిన పాత ఆస్తి గురించి అజయ్ ఘోష్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. అజయ్ ఘోష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నవదీప్ తండ్రి రామారావు 2002లో చీరాల బీచ్ సమీపంలో ఓ రిసార్ట్‌ను ఏర్పాటు చేశారు. దానికి 'రామాపురం రిసార్ట్స్' అనే పేరు పెట్టినట్లు ఆయన తెలిపారు. అప్పట్లో ఆ ప్రాంతం ఇప్పటిలా పెద్దగా అభివృద్ధి చెందకపోయినా, భవిష్యత్తులో అక్కడ పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో ఆయన ఆ ప్రాపర్టీని ఏర్పాటు చేసినట్లు అజయ్ ఘోష్ పేర్కొన్నారు.కాలక్రమంలో నవదీప్ కుటుంబం హైదరాబాద్‌కు పూర్తిగా మారడంతో ఆ రిసార్ట్‌ను విక్రయించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం చీరాల బీచ్ పరిసర ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో అక్కడ భూముల విలువ భారీగా పెరిగిందని అజయ్ ఘోష్ వ్యాఖ్యానించారు. ఆ సమయంలో నవదీప్ కుటుంబం ఆ రిసార్ట్‌ను విక్రయించకుండా తమ వద్దే ఉంచుకుని ఉంటే, ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల ప్రకారం దాని విలువ వందల కోట్ల రూపాయలకు చేరి ఉండేదని అజయ్ ఘోష్ అభిప్రాయపడ్డారు. భూముల ధరలు భారీగా పెరగడంతో ఆ ప్రాపర్టీ ఇప్పుడు ఉండి ఉంటే నవదీప్‌కు ఎంతో విలువైన ఆస్తిగా మారేదని ఆయన కామెంట్ చేశారు.నవదీప్ ఆస్తి గురించి మాత్రమే కాకుండా.. ఇటీవల మరో సినిమా వేడుకలో మాస్ మహారాజ్ రవితేజకు సంబంధించిన రియల్ ఎస్టేట్ గురించి కూడా అజయ్ ఘోష్ మాట్లాడిన విషయం తెలిసిందే. శంకర్‌పల్లి పరిసరాల్లో రవితేజ గతంలో తక్కువ ధరకు భారీ విస్తీర్ణంలో మామిడి తోటను కొనుగోలు చేశారని, ప్రస్తుతం దాని విలువ గణనీయంగా పెరిగిందని ఆయన చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా రవితేజ చెప్పినట్లు అజయ్ ఘోష్ పేర్కొన్న కొన్ని మాటలను కూడా గుర్తుచేశారు. ఆస్తులు, డబ్బు కంటే మనం చేసే పని, మన ప్రయాణమే ముఖ్యమనే భావనతో రవితేజ స్పందించిన తీరు తనకు నచ్చిందని అజయ్ ఘోష్ ప్రశంసించారు. సినీ వేడుకల్లో హీరోల ఆస్తులు, భూముల గురించి అజయ్ ఘోష్ చేస్తున్న వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వ్యక్తం అవుతున్నాయి.

## భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌పై షారుఖ్ ఖాన్ ప్రశంసలు

ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలను బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ కొనియాడారు. దుబాయ్ నుండి ఇజ్రాయెల్ లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో 27 మంది పిల్లలతో సహా మొత్తం 174 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ విమానంలో జరిగిన ఒక ఘటనలో కో-పైలట్ దాడికి పాల్పడినప్పటికీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. ఈ నేపథ్యంలో ఆయన చూపిన తెగువను షారుఖ్ ఖాన్ ధైర్యం, బాధ్యతకు నిజమైన నిదర్శనం అంటూ కొనియాడారు. అనంతరం ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విమాన ప్రయాణంలో అత్యంత సవాలుతో కూడిన పరిస్థితులలో ప్రయాణికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత నిచ్చిన మచ్చర్‌ను ఎస్ఆర్‌కే ప్రత్యేకంగా అభినందించారు.షారుఖ్‌తో పాటు ప్రముఖ నటుడు సల్మాన్ ఖాన్ కూడా పైలట్ సాహసాన్ని ప్రశంసించారు. వీరితో పాటు రణ్‌వీర్ సింగ్, విక్కీ కౌశల్, సన్నీ డియోల్ మరియు తమన్నా భాటియా వంటి ప్రముఖులు కూడా మచ్చర్ చేసిన సాహసాన్ని మెచ్చుకుంటూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఖీ1073 బుధవారం నాడు అత్యవసర సంకేతాలను పంపింది. కో-పైలట్ జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, విమానాన్ని కూల్చేయాలన్న ప్రయత్నాన్ని మచ్చర్ అడ్డుకున్నారు. 34,000 అడుగుల ఎత్తు నుండి విమానం ఒక్కసారిగా 17,000 అడుగులకు పైగా పడిపోయినప్పటికీ, ఆయన దానిని సౌదీ అరేబియాలోని తబుక్ నగరంలో ఉన్న ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దేల్ అజీజ్ విమానాశ్రయానికి సురక్షితంగా మళ్లించారు.

## రెండు వారాల గ్యాప్‌లో సాయిపల్లవి రెండు పాన్ ఇండియా సినిమాలు.. హీరోయిన్‌కు ప్లస్సా? నిర్మాతలకు రిస్కా?



ఒక సినిమా కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్న సమయంలోనే అదే హీరో లేదా హీరోయిన్ నటించిన మరో సినిమా థియేటర్లలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? సాధారణంగా ఒకే నటుడి సినిమాలు తక్కువ గ్యాప్‌లో విడుదలైతే బాక్సాఫీస్ పరంగా పోటీ నెలకొనే అవకాశం ఉంటుంది. అయితే స్టార్ హీరోయిన్ సాయిపల్లవి విషయంలో ఇప్పుడు ఇదే పరిస్థితి కాస్త ఆసక్తికరంగా మారింది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు కేవలం రెండు వారాల వ్యవధిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సాయిపల్లవికి ఇది నటిగా మంచి అవకాశంగా కనిపిస్తున్నప్పటికీ, రెండు సినిమాల నిర్మాతలకు మాత్రం థియేటర్ల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నవంబర్ 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సాయిపల్లవి సీత పాత్రలో కనిపించనుండటంతో ఆమె పాత్రపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'రామాయణ: పార్ట్ 1' విడుదలైన సరిగ్గా రెండు వారాల తర్వాత సాయిపల్లవి నటించిన మరో భారీ చిత్రం 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం' థియేటర్లలోకి రానుంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు.ఈ చిత్రంలో మమ్ముట్టి, శ్రీలీల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయిపల్లవి కూడా కథలో ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఆమె పాత్రలో యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. రెండు సినిమాల మధ్య కేవలం 14 రోజుల గ్యాప్ ఉండటంతో థియేటర్ల కేటాయింపు విషయంలో కొంత ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 'రామాయణ: పార్ట్ 1'కు భారీ స్పందన వచ్చి ఎక్కువ కాలం థియేటర్లలో కొనసాగితే, రెండు వారాల తర్వాత విడుదలయ్యే 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం'కు థియేటర్లు సర్దుబాటు చేయడం కొంత సవాలుగా మారవచ్చు.. అయితే ఈ రెండు సినిమాలు సాయిపల్లవికి ఒక విషయంలో ప్రత్యేకమైన అవకాశాన్ని ఇవ్వనున్నాయి. రెండు చిత్రాల్లోనూ ఆమె పాత్రలు ఒకే తరహాలో ఉండవు. 'రామాయణ: పార్ట్ 1'లో సీతాదేవి వంటి కీలకమైన పౌరాణిక పాత్రలో కనిపించనుండగా, 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం'లో పూర్తిగా భిన్నమైన భావోద్వేగాలు, యాక్షన్ అంశాలతో కూడిన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

## అల్లు అర్జున్ 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి లేదా .. క్లారిటీ ఇచ్చిన హీరోయిన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. దీంతో సినిమా కథ, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన పలువురు ప్రముఖ కథానాయికలు కనిపించనున్నారనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ వంటి పేర్లు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌తో ముడిపడి ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది.మలయాళంతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య లక్ష్మి 'రాకా'లో నటించబోతున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్త అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచింది.అయితే తాజాగా ఈ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి స్వయంగా స్పందించింది. తాను 'రాకా' సినిమాలో భాగం కాదని ఆమె స్పష్టం చేసింది. అంతేకాదు, తనను ఎవరైనా ఈ సినిమాలో చేర్చాలని సరదాగా స్పందించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐశ్వర్య లక్ష్మి 'రాకా' తారాగణంలో లేరని భావించవచ్చు. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో భవిష్యత్తులో తారాగణానికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది.అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అట్లీ గతంలో భారీ కమర్షియల్ అంశాలతో సినిమాలను తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు సమాచారం. సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు భాగం కానున్నారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కథకు అనుగుణంగా ఒకటి కంటే ఎక్కువ కీలక మహిళా పాత్రలు ఉండనున్నాయని, వాటి కోసం స్టార్ హీరోయిన్లను తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే పూర్తి తారాగణంపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించే వరకు ప్రచారంలో ఉన్న పేర్లను నిర్ధారించలేం.'రాకా' సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. కథ, నటీనటులు, సాంకేతిక విభాగం ఇలా ప్రతి విషయంలోనూ భారీగా ప్లాన్ చేస్తున్న ఈ సినిమా అల్లు అర్జున్ అభిమానుల్లోనే కాకుండా ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని పెంచుతోంది.

## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ఫలితంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్.. మేకర్స్‌పై విమర్శలు!

ప్రపంచవ్యాప్తంగా టాలీవుడ్ ఖ్యాతిని నూతన శిఖరాలకు చేర్చిన ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కుటుంబంపై తొలిసారిగా సోషల్ మీడియాలో వ్యతిరేకత వచ్చింది. ఎస్-ఎస్ రాజమౌళి కుమారుడు ఎస్ఎస్ కార్తికేయ నిర్మాతగా అరంగేట్రం చేస్తూ మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కించిన తాజా చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాకు ఊహించని విధంగా నెగెటివ్ టాక్ రావడంతో, నెటిజన్లు నిర్మాత కార్తికేయతో పాటు దర్శకుడు రాజమౌళిని సైతం లక్ష్యంగా చేసుకుని ట్రోల్స్ వర్షం కురిపిస్తున్నారు. టాలీవుడ్ వర్గాల్లో మరియు సాధారణ ప్రేక్షకులలో కార్తికేయ తన తొలి ప్రయత్నంగా ఎలాంటి సరికొత్త కథాంశాన్ని తీసుకువస్తున్నారనే దానిపై ఎంతో ఆసక్తి నెలకొంది. సినిమాపై ఉన్న నమ్మకంతో చిత్ర యూనిట్ సాధారణ విడుదలకు ముందే గురువారం రోజున పెయిడ్ ప్రీమియర్ షోలను కూడా నిర్వహించింది. అయితే షోలు పడిన క్షణం నుంచే సినిమాకు డిజాస్టర్ టాక్ రావడంతో సోషల్ మీడియా వేదికగా కార్తికేయపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఏమాత్రం ఆకట్టుకోని కథనం, పేలవమైన దర్శకత్వ ప్రతిభపై ప్రేక్షకులు తమ అసంతృప్తిని సోషల్ మీడియా వేదికగా నిలదీశారు.మరోవైపు, సినిమా విడుదల కాకముందే లేదా ఇండస్ట్రీ వర్గాల స్నేహపూర్వక వాతావరణంలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ చిత్రాన్ని వీక్షించి చిత్ర యూనిట్‌ను, కార్తికేయను అభినందిస్తూ ప్రశంసల జల్లు కురిపించారు. అయితే సినిమా విడుదలైన తర్వాత ఘోర పరాజయం చవిచూడటంతో, మహేష్ బాబు గతంలో చేసిన ఆ ప్రకటనలపై కూడా సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు వేస్తూ ట్రోల్ చేయడం ప్రారంభించారు. వాస్తవానికి ఈ చిత్ర నిర్మాణంతో ఎస్ఎస్ రాజమౌళికి ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, సినిమాకు వచ్చిన పేలవమైన ఫలితం కారణంగా తండ్రి పేరును కూడా లాగుతూ కొందరు నెటిజన్లు టార్గెట్ చేయడం ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## 'జైలర్ 2' కోసం తప్పుకున్న ధనుష్.. 'ఓం చాప్టర్ 1' కొత్త విడుదల తేదీ ఖరారు



కోలీవుడ్ స్టార్ హీరో ధనుశ్, లెజెండరీ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న తాజా చిత్రం 'ఓం చాప్టర్ 1'. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాను నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వం వహిస్తున్నారు.ముందుగా అనుకున్న ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదలవుతుండటంతో, రజినీకాంత్ పై ఉన్న అపారమైన గౌరవంతో ధనుశ్ ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు గతంలోనే ప్రకటించారు. రూ. 600 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2'తో బాక్సాఫీస్ వద్ద పెద్ద ఎత్తున క్లాష్ ఏర్పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. రజినీకాంత్ సినిమాతో పాటు, దీపావళి బరిలో నిలవాలని భావించిన హిందీ చిత్రం 'రామాయణ పార్ట్ వన్' మరియు సూర్య నటిస్తున్న 'సీన్' సినిమాలతో కూడా ఎలాంటి పోటీ లేకుండా ఉండేందుకే ఈ నవంబర్ తేదీని లాక్ చేసినట్లు వెల్లడించారు. పరిశ్రమలో పెద్ద సినిమాలు ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవించుకోవాలని, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాలని ధనుశ్ అభిప్రాయపడ్డారు.రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎజిల్ అరసు కె. సినిమాటోగ్రఫీ, ఆర్. కలైవనన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రద్ధా అగర్వాల్, ధనుశ్, అజ్మత్ జగ్మగ్ సంయుక్తంగా వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'మహాకాళ్'తో భన్సాలీకి సంబంధం లేదు.. బాలీవుడ్ ప్రాజెక్ట్‌పై క్లారిటీ ఇచ్చిన చందూ మొండేటి

టాలీవుడ్ సంచలన దర్శకుడు చందూ మొండేటి తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'మహాకాళ్' సినిమాకు, ప్రముఖ బాలీవుడ్ దర్శక-నిర్మాత సంజయ్ లీలా భన్సాలీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వీరిద్దరి కలయికపై వస్తున్న రకరకాల ఊహాగానాలకు ఆయన తెరదించారు. అయితే, ఇదే సమయంలో బాలీవుడ్ స్టార్ మేకర్ సంజయ్ లీలా భన్సాలీతో తాను కలిసి పనిచేయబోతున్నట్లు ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించి అందరిని షాక్‌కి గురిచేశాడు.తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చందూ మొండేటి మాట్లాడుతూ.. సంజయ్ లీలా భన్సాలీ తనను ప్రత్యేకంగా సంప్రదించారని, ఆయనతో తాను ఒక విభిన్నమైన ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. భన్సాలీ స్వయంగా తనకు రెండు వేర్వేరు అద్భుతమైన కథలు వినిపించారని, తన నిర్మాణ సంస్థలో అందులో ఒక సినిమాను డైరెక్ట్ చేయాలని కోరారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని చందూ మొండేటి స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఎంతో కసిగా తెరకెక్కిస్తున్న 'మహాకాళ్' సినిమా షూటింగ్ పూర్తిగా పూర్తయిన తర్వాతే, బాలీవుడ్ ప్రాజెక్ట్‌కు సంబంధించి తదుపరి అడుగులు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఒక వైపు పాన్-ఇండియా రేంజ్‌లో 'మహాకాళ్' చిత్రంతో పాటు మరోవైపు ప్రముఖ బాలీవుడ్ దిగ్గజ నిర్మాణ సంస్థతో సినిమా చర్చలు జరుగుతుండటంతో టాలీవుడ్ వర్గాల్లో ఈ వార్త హాట్ టాపిక్‌గా మారింది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma